క్లుప్తంగా

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్

కొడంగల్ రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతూ చిరు వ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషిచేయాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ కోరారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చిరు వ్యాపారుల డబ్బాలను తొలగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట డబ్బాలను తొలగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవంతం చేయాలి

అనంతగిరి: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు డిమాండ్ విషయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య సోమవారు చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కావున ఈ దీక్షకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది నాయకులు, మేధావులు, విద్యావేత్తలు, యువకులు, మహిళలు, విద్యార్థులు తరలి రావాలని ఆయన కోరారు.

నేరాల నియంత్రణలో భాగస్వామ్యం తప్పనిసరి

సీఐ శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

పూడూరు: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని, ప్రతీ పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చంగముల్ పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం ఎస్‌ఐ భరత్ రెడ్డి, దోమ ఎస్‌ఐ వసంత్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్: సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ సభ్యులు మరింత విస్తృతం చేయాలని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో మొక్కలు నాటారు. మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. బుగ్గారెడ్డి గార్డెన్‌లో వికలాంగునికి ట్రై స్కూటీ, మహిళకు కుట్టు మిషన్, ముగ్గురు పేద విద్యార్థులకు సైకిళ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. సంపాదనలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శరత్‌చంద్రబాబు, మధన్‌మోహన్ రెడ్డి, మామిడి భీంరెడ్డి, రవికుమార్, అంజయ్య, రామకృష్ణారెడ్డి, రంగయ్య, శ్రీనివాస్, రాజేష్, సతీష్, వెంకటేశ్, నర్సింహ్మారెడ్డి, వెంకట్ నాయక్, సందీప్, మురళీ పాల్గొన్నారు.

బీసీసేన గ్రామ కమిటీ ఎన్నిక

షాబాద్: బీసీసేన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు దయాకర్ చారి, ఉపాధ్యక్షుడు బాలరాజ్, యువజన అధ్యక్షుడు అజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కేసారం గ్రామంలో నూతన అధ్యక్షుడిగా సుభాష్‌చంద్ర, ఉపాధ్యక్షుడిగా చాకలి రవి, ప్రధాన కార్యదర్శిగా మంగలి చంద్రశేఖర్, కార్యదర్శిగా మహమ్మద్ ఖాసీంలను నియమించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు బర్కకృష్ణ మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం 45 ఏళ్లుగా ఆర్.కృష్ణయ్య పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రేపు జరగబోయే ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్షకు పెద్ద ఎత్తున బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మల్లేశ్, విఠల్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు రవీందర్, భిక్షపతి, ఆంజనేయులు, సుధాకర్ గౌడ్, ప్రభాకర్, సత్యం పాల్గొన్నారు.

ఆశల పల్లకి!

- ఎంపీపీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠత
- కొత్త మండలంపై ఆశావహుల ఎదురుచూపు
- జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎవరికీ దక్కనుందో
- రిజర్వేషన్లు ప్రకటించేందుకు ప్రభుత్వం కసరత్తు



మండల ప్రజా పరిషత్ కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో ఇక్కడ మొదటి సారి ఎన్నికలు జరగనున్నాయి. కాబట్టి మండలానికి ఒక జెడ్పీటీసీ, ఒక ఎంపీపీ స్థానాలు కేటాయిస్తారు. ఈ రెండు కూడా అత్యంత ప్రాధన్యత కలిగినవే. వాటిని దక్కించుకోవడానికి పోటీ కూడా తీవ్రంగానే ఉండబోతోంది. దీనికోసం మండలానికి చెందిన రాజకీయనాయకులు, అనుభవం ఉన్న నాయకులు సాధారణ వ్యక్తులు, యువకులు పోటీలో ఉండడం సహజం. ప్రభుత్వం ఇంకా రిజర్వేషన్లు ఖరారు చేయలేదు. ఇటీవలే మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. ఈ రెండు స్థానాలకు పోటీ చేసే ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంది.

ఎవరికీ వారే..

నూతన మండలం కావడంతో మొదటి సారిగా ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు ఎవరికి వరించనుందో వారి పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అందు కోసం మండలంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, జిల్లా స్థాయి నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. పోటీ చేయడానికి తాము సిద్ధంగానే ఉన్నట్లు సంకేతాలు ఇస్తున్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్నీ సామాజిక వర్గాలకు చెందిన బడా నాయకులు ఆర్థికంగా బలంగానే ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆర్థిక, జనభలం ఉన్న నాయకులు, వ్యక్తులు మండలంలో చాలా మంది ఉన్నారని తెలుస్తోంది. ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ వరించినా ఆయా వర్గాలకు చెందిన వ్యక్తులు, నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొనే అవకాశం మెండుగానే ఉన్నాయి. దీంతో ఆశావహులు రిజర్వేషన్ల ప్రకటన కోసం ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. దుద్యాల, హకీంపేట్, ఈర్లపల్లి, లగచర్ల, కుదురుమల్ల, చిలుముల మైల్వార్, పోలేపల్లి, పల్లెగడ్డ, గౌరారం గ్రామాల్లో పోటీలో ఉండబోతున్న వ్యక్తులు ఆర్థికంగా భలంగా ఉంటూ, పోటీకి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపిస్తున్నారు. అలాగే చెట్టుపల్లి తండా, నాన్య నాయక్ తండా, సంట్రకుంట తండా, సోమ్లు నాయక్ తండా, వాల్య నాయక్ తండా, సాగారం తండాలకు చెందిన గ్రామాల్లో ఎస్టీ రిజర్వేషన్ ప్రకటన విడుదలైతే పోటీకి ఆ వర్గం నుంచి నాయకులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎవరికీ వారే పోటీలో తాము కూడా ఉండబోతున్నామని ప్రచారం చేసుకుంటున్నారు.

మండలంపై ప్రత్యేక దృష్టి..

దుద్యాల్ మండలంపై అన్ని పార్టీల నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడ రూ. కోట్లల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్లు, పారిశ్రామిక వాడల ఏర్పాటు, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, పాఠశాల భవన నిర్మాణాలు, నైపుణ్య శిక్షణ కేంద్రం, ప్రభుత్వ పెట్రోల్ బంక్, కళాశాలల ఏర్పాటు, దవాఖాన ఏర్పాటు వంటి పనులు శర వేగంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సంబంధించిన పనులు ప్రారంభమైతే వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇవన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పార్టీల నాయకులు పోటీకి సై అంటున్నారు.

బలాలు, బలహీనతలు

నూతన మండల ఏర్పాటు తరువాత మొదటి సారిగా ఎన్నికలు జరగనున్నాయి. కావున అందరి చూపు దీనిపైనే ఉంది. అందుకు లగచర్ల ఘటన కూడా మరో కారణంగా నిలిచింది. దుద్యాల్ మండలం ఏ పార్టీకి అనుకూలంగా మారనుందోనని రాష్ట్ర స్థాయిలో కూడా చర్చ జోరుగానే సాగుతుంది. ఎన్నికలు జరిగితే ఏ పార్టీ అభ్యర్థులకు పట్టం కడతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మొదలైన లాబీయింగ్

ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు ప్రభుత్వం త్వరలో రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. దీంతో ఆయా పార్టీ పెద్దలతో ఆశావహులు గ్రూపులుగా ఏర్పడి ఎవరికీ వారే లాబీయింగ్‌లు చేసుకునే పనిలో పడ్డారు. మా సామాజిక వర్గానికే రిజర్వేషన్ ప్రకటించాలని ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు ముఖ్యమంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జిల దగ్గరకు క్యూ కడుతున్నారు. తమ సామాజిక వర్గాలకు దక్కే విధంగా రిజర్వేషన్లు ప్రకటించాలని పార్టీ పెద్దలకు అల్టిమేటం జారీ చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాకా అధికార పార్టీ బడా నాయకులు తలలు పట్టుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామ, మండల స్థాయి అధ్యక్షులతో ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు అనుకూలంగా ప్రకటించాలని ఒత్తిడి తెస్తున్నారు. రిజర్వేషన్ ప్రకటించిన తర్వాత టికెట్లు విషయం తేల్చుకోవచ్చనే భావన నాయకుల వద్ద వ్యక్తమవుతుంది. ఈ విషయంలో ఏం జరుగనుందో భవిష్యతే తేల్చాల్సి ఉంది.

మండల వివరాలు..

మండల వ్యాప్తంగా 8 ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం కేటాయించింది. అందులో దుద్యాల్-2, లగచర్ల-1, హకీంపేట్-1, గౌరారం-1, పోలేపల్లి-1, చిలుముల్ మైల్వార్-1, కుదరుమల్ల-1 ఉన్నాయి. మండల వ్యాప్తంగా పై స్థానాలకు 21 గ్రామ పంచాయతీలు అందుబాటులో ఉన్నాయి. మండలంలో మొత్తం 23,197 మంది ఓటర్లు ఉన్నారు.

యూరియా కొరత లేదు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం



మాట్లాడుతున్న వెంకటేశం

బంట్వారం: రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేదని కేవలం బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారం మాత్రమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన బంట్వారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. అందులో భాగంగానే ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీల ఒత్తిడితో మరో 50 వేల టన్నులు రాష్ట్రానికి రానుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీత వేస్తుందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, నాయకులు మొగులయ్య, పురుషోత్తం రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహరెడ్డి, నర్సింలు, సుధాకర్, కృష్ణ, ఎల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్ మాదిగ

పరిగి: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్‌మాదిగ పేర్కొన్నారు. ఆదివారం జాఫర్‌పల్లి గ్రామంలో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న సింహగర్జనపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు అందజేయనున్న చేయూత తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ మహాసభకు ప్రతిఒక్కరూ హాజరై హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ రవికుమార్, నాయకులు ప్రభాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

- శ్రీసత్యసాయి గ్రామోత్సవాలు ప్రారంభం
- భజన మండలి, విద్యార్థులకు పద్యాలు, శ్లోకాలు, కథల పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న భాస్కర్‌రావు

ధారూరు: ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, పాఠశాలల స్వీపర్లు, పారిశుద్ధ్య కార్మికులను శ్రీసత్యసాయి గ్రామోత్సవాల సందర్భంగా సన్మానించారు. మండలంలోని హరిదాస్‌పల్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో ఆదివారం శ్రీసత్యసాయి గ్రామోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు పూలమాలలు వేసి, శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఆయా గ్రామాల్లో భజన మండలి, బాలవికాస్ విద్యార్థులకు పద్యాలు, శ్లోకాలు, కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ కమ్యునిటీ సెంటర్ కార్యదర్శి, కోశాధికారి సుజాత, సత్యసాయి రాష్ట్ర వైద్య విభాగ సమన్వయ కర్త భాస్కర్‌రావు, కేరెల్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రం ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధితో గ్రామాల అనుసంధానం

కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: రోడ్ల అభివృద్ధితోనే గ్రామాలకు అనుసంధానం పెరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మండల పరిధి నక్కలపల్లి గ్రామంలో ఎంపీ నిధులు రూ.ఐదు లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అధికారం చేపట్టిన అనతి కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలను చూసి, ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక పోతున్నాయని, బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్‌భరత్, మండల అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ రాజు, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మీనాజుద్దీన్, నాయకులు రవి, మల్లేశ్, శ్రీకాంత్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా ఇంటిని నిర్మించుకోవాలి

మొయినాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీమ్‌భరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్‌లు అన్నారు. మండల పరిధి ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల ఇళ్లను వారు ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఇంటి నిర్మాణ విషయంలో నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. లబ్ధిదారులకు ఇవ్వనున్న రూ.5 లక్షల నిధుల్లో విడతల వారీగా వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందని తెలిపారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క నిరుపేదకు ఇంటిని నిర్మించి ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పేదోడి సొంతింటి కళను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ ఎంపీటీసీ కేబుల్ రాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఫిషర్‌మెన్ మండల చైర్మన్ భిక్షపతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మీనాజుద్దీన్, రాజు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పోస్టు కార్డుల ఉద్యమం

మొయినాబాద్: తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులు పోస్టు కార్డుల పోరాటం మొదలు పెట్టారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఉత్తరాలు రాశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం వాటిని పోస్టు చేశారు. ఎన్నికల్లో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలనెలా పింఛన్ ఇస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా హామీని అమలు చేయలేదని, వెంటనే మాట నిలబెట్టుకోవాలని ఉత్తరంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేష్, మండల అధ్యక్షుడు మహిపాల్, ఉద్యమకారులు మధు, రత్నం, ముకుందరెడ్డి, బన్సీలాల్, వెంకటయ్య, భాస్కర్, భిక్షపతి, కృష్ణ, నర్సింహులు, అవినాష్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దోమ: మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్‌లో జిల్లా పరిషత్ పాఠశాల 1986-1987 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 38 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై ఒకరినొకరు కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారి కుటుంబ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందోత్సవాలతో గడిపారు. నాటి ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత విశ్రాంత ఉపాధ్యాయులు శేషయ్య, చెన్నకేశవులు, సదానందం, బురానోద్దీన్‌లను ఆహ్వానించి వారితో పలు విషయాలు పంచుకున్నారు. అనంతరం శాలువా కప్పి, బొకె ఇచ్చి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడారు. 38 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గులాం, జనార్ధన్, సురేశ్, శ్రీశైలం, వెంకటయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పదోన్నతి కల్పించడం హర్షణీయం

పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, గోపాల్, కృష్ణ



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దోమ: తాము చదువుకున్న సమయంలో ఉపాధ్యాయులుగా బోధించిన జాక వెంకటేశం, మహేందర్ బహదూర్‌లకు పదోన్నతులు కల్పించడం హర్షణీయమని అయినాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, గోపాల్, కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పరిగి పట్టణ కేంద్రంలో జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాఠశాలలో తమ గురువులు మెరుగైన విద్యా బోధన చేపట్టడం వల్లే తాము వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో కొనసాగుతున్నామని పేర్కొన్నారు. తమ ఉపాధ్యాయులు ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితం కొనసాగించాలని భగవంతుడిని వేడుకున్నారన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



విగ్రహాలను పంపిణీ చేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సత్య శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. హిందూ సంప్రదాయాల్లో వినాయక పూజకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి శుభకార్యానికి ముందు గంగ పుత్రుడికి పూజ చేసే ఆచారం ఉందని చెప్పారు. చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడనుందని, మట్టి ప్రతిమలను నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌కుమార్, సత్యనారాయణ, కరుణాకర్, ఆర్య వైశ్య సంఘం నాయకులు శ్రీనివాసులు, ప్రకాష్, రవికుమార్, వంశీకృష్ణ, అశోక్, మురళీ, ప్రవీణ్, క్యామ మహేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, నర్సింహులు

కుల్కచర్ల: పేదలకు అండగా ఉంటామని మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, నర్సింహులు పేర్కొన్నారు. ఇప్పాయపల్లి గ్రామానికి చెందిన కావలి పెద్ద వెంకటయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్య క్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చిన్న వెంకటయ్య, బొరింగ్ నర్సింహులు, మధుగౌడ్, బుడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

బసవలింగేశ్వరుడికి మహా రుద్రాభిషేకం



కొడంగల్: పల్లకీ సేవలో స్వామివారికి మంగళ హారతులు ఇస్తున్న మహిళలు

కొడంగల్: శ్రీజగద్గురు నిరంజన మఠంలో వీరశైవ సమాజం సభ్యులు శ్రావణ మాస ముగింపు పూజలను ప్రారంభించారు. ఉదయం మఠాధిపతులు డాక్టర్ సిద్దిలింగ మహాస్వామి సమక్షంలో పూజారులు శాస్త్రోక్త మంత్రోచ్ఛరణలతో నమకం, చమకం అధ్యాయాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. గణపతి పూజ, సంకల్పం, రుద్రాభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అష్టోత్తర శతనామావళితో త్రిదళం, బిల్వ పత్రాలతో శ్రీబసవేశ్వరస్వామివారికి బిల్వార్చనను అత్యంత వైభవంగా చేపట్టారు. శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, పంచాక్షరీ స్తోత్రం, దూపదీప నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు ఖడ్గాలు వేస్తూ స్వామివారిని వేడుకున్నారు. మహిళలు మంగళ హారతులు ఇస్తూ, పాటలు పాడుతూ స్వామివారిని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మహాదేవుని ఆలయంలో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో అక్కమహాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగాష్టకం, శివాష్టకం, భ్రమరాంబిక అష్టకం, శివ పంచాక్షరీ స్తోత్రం, కాలభైరవాష్టకం, ద్వాదశ జ్యోతిర్లింగ స్మరణ, అష్టాదశ శక్తిపీఠ స్తోత్రం, శివాష్టోత్తర శతనామావళి, లింగస్తుతిలను నెల రోజులపాటు పఠించారు. ముగింపు ఉత్సవాల సందర్భంగా శివలింగానికి, పార్వతీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దూప, దీప, నైవేద్యం సమర్పిస్తూ మంగళ హారతులు ఇచ్చి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

హస్నాబాద్‌లో..



దుద్యాల్: కాశీ విశ్వేశ్వర దేవాలయంలో భజనలో పాల్గొన్న భక్తులు

దుద్యాల్: హస్నాబాద్‌లోని ఆంజనేయ స్వామి, భళభీమా సేనా స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి, వీరభద్రేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పంచామృతాభిషేకం, శివాష్టకం, లింగాష్టం, పఠించారు. అనంతరం దేవాలయాల్లో చేపట్టిన భజన అందరిని ఆకట్టుకుంది. అనంతరం దుద్యాల్ మండల కేంద్రంలో మ్యాకం ప్రభాకర్ స్వంత ఖర్చుతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.